లబ్ధిదారులకు న్యాయం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి



బాణాపురం ఇందిరమ్మ ఇళ్ల వద్ద మాట్లాడుతున్న నాయకులు

జనగామ: పట్టణంలోని మూడో విడత ఇళ్ల లబ్ధిదారులకు కలెక్టర్ చొరవ తీసుకుని న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని లబ్ధిదారులు సొంతింటి కల సాకారం చేసుకునేందుకు ఎవరికి భయపడకుండా, గృహ ప్రవేశాలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మూడో విడతలో 11వేల 44 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. వాటి నిర్మాణంలో జాప్యం జరగడంతో స్థలంలో చిన్నపాటి ఇంటి నిర్మాణాలు చేసుకోవడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, అప్పటి కలెక్టర్‌లు కలుగజేసుకుని నచ్చజెప్పారన్నారు. 560 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరైనట్లు చెప్పి, అక్కడ నిర్మాణం చేసుకున్న ఇళ్లను కూల్చి వేసి ఇప్పుడు మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో హైకోర్టుకు సైతం వెళ్లగా, ఇందిరమ్మ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించరాదని కలెక్టర్‌ను ఆదేశించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న ఇళ్లను వార్డుల వారిగా సభలు నిర్వహించి లబ్ధిదారులను లెక్కిస్తామంటే ఊరుకునేది లేదని, గతంలో గుర్తించిన పేదలకు అన్యాయం చేయడమే అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, భూక్య చందు నాయక్, సుంచు విజేందర్, ఉపేందర్, కళ్యాణి, లలిత, రజిత ఉన్నారు.

తండాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

చిల్పూరు: తండాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. తీగలతండాలో రూ.10 లక్షల జెడ్పీ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను సోమవారం సర్పంచ్ మాలోత్ లక్ష్మీఠాకూర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం తీగల సాంబరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సంపత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మట్టిరోడ్లు లేకుండా సీసీరోడ్లు వేయిస్తానని చెప్పారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, మండల రైతు కోఆర్డినేటర్ జనగాం యాదగిరి, ఇల్లందుల సుదర్శన్ పాల్గొన్నారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి

● నాబార్డు సీజీఎం చింతల సుశీల



విద్యార్థులతో పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాబార్డు సీజీఎం సుశీల

చిల్పూరు: ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటు చేసుకుంటే.. క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కవచ్చని నాబార్డు సీజీఎం చింతల సుశీల అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న 'స్కూల్ బ్యాంక్ ఆఫ్ చిల్పూరు'ను ఆమె సోమవారం సందర్శించారు. బ్యాంకులో రూ.4,500 డిపాజిట్ చేసిన అనంతరం హెచ్‌ఎం లీల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా ఫైనాన్షియల్ లిటరసీ ప్రోగ్రాంలో భాగంగా తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం నుంచి ఈ పాఠశాలను ఎంచుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్ అవసరాలకు డబ్బును బ్యాంకుల్లో జమ చేసుకోలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ మహేందర్, నాబార్డు వరంగల్ క్లస్టర్ ఆఫీస్ డీడీఎం చంద్రశేఖర్, రవి, డీసీసీ బ్యాంకు సీఈఓ చిన్నారావు, డీసీసీబీ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాబార్డు ప్రాజెక్టు మేనేజర్ వెంకట్, చిల్పూరుగుట్ట రైతు ఉత్పత్తి దారుల సంస్థ సీఈఓ దోకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ..

జనగామ: ఆర్థిక అక్షరాస్యతా వారోత్సల సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. వృథా ఖర్చులు తగ్గించుకుని డబ్బు ఆదా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్, డీఆర్‌డీఓ రాంరెడ్డి, సివిల్‌సప్లయ్ డీఎం రోజారాణి, ఏపీడీ నూరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ: వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇచ్చి పంటలను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతుండడంతో సోమవారం కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి నారాయణరెడ్డి, పట్టణ కిసాన్‌సెల్ అధ్యక్షుడు మోటే శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రేయిన్‌మార్కెట్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడీఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓ వైపు కరెంటు లేక పంటలు ఎండుతుంటే.. 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం పచ్చి అబద్దాలు చెప్పడం సిగ్గు చేటన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్‌పల్లి లింగాజీ, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, నాయకులు ఉడుత రవియాదవ్, కొన్నె మహేందర్‌రెడ్డి, వంచ వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, కృష్ణస్వామి, సతీష్, లక్ష్మయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, ఎల్లయ్య, ధర్మేందర్, మల్లేష్, జాఫర్, నిఖిల్, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ: భారత కరెన్సీపై రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని కోరుతూ అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పర్శరాములు సోమవరాం జిల్లా కేంద్రానికి వచ్చిన వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకు కలిసి విజ్ఞప్తి చేశారు. న్యాయమైన డిమాండ్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని షర్మిల చెప్పినట్లు ఆయన వివరించారు. గిరిమల్ల రాజు, పిడుగు ఆశీర్వాదం, మిద్దెపాక రాజు, మిద్దెపాక మహేందర్, మల్లెపాక పర్శరాములు, ఎడవెల్లినరేష్ ఉన్నారు.

స్పందించకుంటే రాజీనామా చేస్తాం..



మాట్లాడుతున్న సింగపురం దయాకర్

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిషత్ అధికారుల పనితీరు ఇబ్బందిగా ఉంది.. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోకుంటే పదవులకు రాజీనామా చేస్తామని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సింగపురం దయాకర్, నియోజకవర్గ ప్రజాప్రతినిధుల అధికార ప్రతినిధి గన్ను నర్సింహులుగుప్తా అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కార్యాలయంలో ఏఒక్కరూ సమయ పాలన పాటించడం లేదు.. అధికారులు మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా రావడంలేదు.. దీంతో పనులన్నీ నిలిచిపోతున్నాయని చెప్పారు. గ్రామాల్లో చేపట్టిన పనులకు ఎంబీ రికార్డు చేసినా పాస్ ఆర్డర్ ఇవ్వడం లేదన్నారు. జెడ్పీకి సరైన వర్క్ ప్రొఫార్మా లేకుండా.. వన్‌సైడ్ వేస్టు పేపర్‌లో రికార్డులు పంపుతుండడంతో రిజెక్టు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బిల్లులు రావడం లేదని, ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్ ఎంపీడీఓతో పాటు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు. సమావేశంలో శివునిపల్లి ఎంపీటీసీ గుర్రం రాజు, టీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కనకం గణేష్, ఛాగల్లు, ఘన్‌పూర్ ఎంపీటీసీలు కనకం స్వరూప, మునిగెల రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న వినోద్

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి/దేవరుప్పుల: రానున్న రోజుల్లో ప్రజల చేతుల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం తప్పదని టీపీసీసీ కార్యదర్శి చేపూరి వినోద్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్‌ఎస్ నిరంకుశ పాలన సాగిస్తుందని, అవినీతి రాజ్యమేలుతుందన్నారు. నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టారని, యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిశీలించి పరిష్కరించే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్రను చేపట్టారన్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర ఈనెల 17న స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి రానుందని, ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, పీటర్, దర్శనం, ఏలియా, డేవిడ్, కిషన్ రెడ్డి పాల్గొన్నారు. కాగా, రేవంత్‌రెడ్డి పాదయాత్రను పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకుడు డివిజన్ కేంద్రంలోని శివాజీచౌక్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. అలాగే రఘునాథపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య పాల్గొని మాట్లాడారు. నర్సింహారెడ్డి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని భార్గవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రదీప్ రెడ్డి, యకయ్య, ఎర్రయ్య, ధర్మారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని మాకు అప్పగించండి..!



రఘునాథపల్లి: రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన భూములకు బదులుగా తమకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆక్రమించి చదును చేసి భూమిలోకి మమ్మల్ని రాకుండా భయపెడుతోన్న వ్యాపారులపై చర్య తీసుకోవాలని ఆంధ్రతండాకు చెందిన గుగులోత్ అంజ్య, వెంకట్‌రాం, ప్రమీల, బాబు, స్వామి తదితరులు తహసీల్ ఎదుట బైఠాయించారు. సోమవారం మా భూమిని మాకు అప్పగించండని ఆందోళన చేస్తున్న గిరిజనులను తహసీల్దార్ అన్వర్ తన వద్దకు పిలిపించుకొని వినతి పత్రం స్వీకరించారు. అంతే కాకుండా రెవిన్యూ సిబ్బందిని విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంగా బాధిత గిరిజనులు మాట్లాడుతూ మా భూమిని అక్రమించిన వ్యాపారులపై, ఈ వివాదానికి కారకులైన హుస్సేన్, రవిలపై చర్య తీసుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేయగా న్యాయం చేస్తానని తెలిపినట్లు బాధితులు చెప్పారు.

పీవీఆర్ పాఠశాలలో ఈ-వేస్ట్ సేకరణ



ఈ-వేస్ట్ వస్తువులను అందజేస్తున్న విద్యార్థులు

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తి పీవీఆర్ పాఠశాలలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ సూర్య ఆధ్వర్యంలో 500 కిలోల ఈ-వేస్ట్‌ను సేకరించారు. సాంకేతిక ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం అధికమవుతున్న తరుణంలో వచ్చే కొత్త ఫ్యూచర్లతో ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు చెత్తకుప్పల్లో చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని సేకరించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా చేపడుతున్న ఈ వేస్ట్ వస్తువులను సేకరణను ప్రారంభించింది. అందులో భాగంగా పీవీఆర్ పాఠశాలలో సేకరించిన 500 కిలోల ఈ వేస్టును జిల్లా గవర్నర్ కన్నా పరశురాములుకు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్య అధ్యక్షుడు వెంకట్‌రెడ్డిని గవర్నర్ కన్నా పరశురాములు అభినందించారు.

అధికారంలోకి రావడం ఖాయం



చిల్పూరు: మాట్లాడుతున్న మాదాసు వెంకటేష్

రఘునాథపల్లి/చిల్పూరు/జఫర్‌గఢ్/లింగాలఘణపురం : ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంకుశ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్‌యాదవ్ అన్నారు. సోమవారం రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లిలో బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో జరిగిన శక్తి కేంద్ర కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, వల్లాల వెంకటేష్‌యాదవ్, రాజు, వాసుదేవరెడ్డి, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే చిల్పూరులో జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేశ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుంటే వాటిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమవిగా ప్రచారం చేస్తుందని ఆయన అన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కందుకూరి రజనీకర్, పార్టీ మండల అధ్యక్షుడు పెండ్యాల దిలీప్, నాయకులు సంపత్‌రెడ్డి, మధు, బ్రహ్మచారి, సుధాకర్, ప్రవీణ్, సంపత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు. కాగా, జఫర్‌గఢ్ మండలం హిమ్మత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలకే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిమితమైందనారు. ఇన్‌చార్జ్ మేరుగు రామరాజు పాల్గొన్నారు. లింగాలఘణపురం మండలం మాణిక్యాపురంలో గ్రామశక్తి కేంద్రం ఇన్‌చార్జ్ దూసరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కొంతం శ్రీనివాసు, బొక్క ప్రభాకర్, సంపత్, నాయకులు ఆంజనేయులు, భాస్కర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

దైవసన్నిధిలోనే మానసిక ప్రశాంతత



కొడకండ్ల: ప్రతి ఒక్కరికి దైవసన్నిధిలోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, భక్తి భావాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం ఏడునూతులలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన లింగమంతుల స్వామి ఉత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్‌గాంధీనాయక్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఉమేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సోమన్న, సొసైటీ డైరెక్టర్లు కుమార్, యాకన్న, సంఘం అధ్యక్షుడు నర్సయ్య, మల్లయ్య, బ్రహ్మచారి, వెంకన్న, లింగయ్య సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

సామాజిక సేవ చాలా గొప్పది


బచ్చన్నపేట: సామాజిక సేవ చేయడం చాలా గొప్పదని.. దానిని చేయడానికి ముందుకు వచ్చే నాయకులు చాలా అరుదుగా ఉంటారని కల్నల్ మాచర్ల భిక్షపతి ముదిరాజ్ అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, అంజయ్య దంపతులను సోమవారం శాలువాలతో సన్మానించి మాట్లాడారు. కట్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: నాగిరెడ్డిపల్లికి చెందిన తాతిరెడ్డి బుచ్చిరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వైద్యం ఖర్చులకు బీఆర్‌ఎస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సాయం సోమవారం అందించారు. శశిధర్‌రెడ్డి, బాపురెడ్డి, మల్లేశం, ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

● జిల్లా సంక్షేమాధికారి జె.జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న జయంతి

జనగామ రూరల్: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సంక్షేమాధికారి జె.జయంతి అన్నారు. బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో చైల్డ్‌లైన్ సభ్యులతో సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామాలు, మండల కేంద్రాల్లో అగాహన సదస్సులు నిర్వహించి తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుందనే సమాచారం తెలిస్తే హెల్ప్‌లైన్ నంబర్ 1098కు కాల్ చేస్తే.. వెంటనే చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, సీడీపీఓలు రమాదేవి, ఫ్లోరెన్స్, ఏసీడీపీఓ విజయలక్ష్మి, పోషన్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, సఖి కేంద్రం నిర్వాహకులు రేణుక, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి స్థల విరాళం



జఫర్‌గఢ్: జానెడు స్థలం కోసం గొడవలు పడుతున్న ప్రస్తుత తరుణంలో ఏకంగా రూ. 2లక్షల విలువైన 516 గజాల స్థలాన్ని తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కొనుగోలు చేసి జీపీకి అందజేసి పలువురి మన్ననలు పొందారు తమ్మడపల్లి(జి) సర్పంచ్ దంపతులు అన్నెపు పద్మఅశోక్. తమ్మడపల్లి (జి) పంచాయతీ భవనం ఇరుకుగా ఉండడమే కాకుండా శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణం కోసం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. మరికొంత స్థలం కలిసి పెద్దగా భవనాన్ని నిర్మించొచ్చని సొంత డబ్బులతో ఓ వ్యక్తి వద్ద కొనుగోలు చేసి తల్లిదండ్రులు అన్నెపు దర్గయ్య, నర్సమ్మల జ్ఞాపకార్థం అందజేసి పనులను చేపట్టారు.

వెట్టిచాకిరీ విముక్తికి పోరాటం



దేవరుప్పుల: గ్రామీణ ప్రాంతాల పురోగతికి విశేష సేవలందిస్తున్న పంచాయతీ సిబ్బంది వెట్టిచాకిరీ విముక్తి కోసం సమరశీల పోరాటం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ అన్నారు. ఈ మేరకు చేపట్టిన పాలకుర్తి టు హైదరాబాద్ పాదయాత్ర సోమవారం ధర్మాపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా సాయుధ పోరాట యోధుడు దరోగ్యనాయక్‌తో మాట్లాడిన అనంతరం మండల కేంద్రంలోని షేక్ బందగీ, డాక్టర్ అంబేద్కర్ స్మారక విగ్రహాల వద్ద నివాళులర్పించారు. సింగరాజుపల్లికి వరకు పాదయాత్ర సాగింది. కార్యక్రమంలో నాయకులు రాపర్తి రాజు, గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, గణపతిరెడ్డి, తునికి మహేష్, వినోద్‌కుమార్, బత్తిని వెంకన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

లాజిస్టిక్ సేవలను వినియోగించుకోవాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్టీసీ అందిస్తున్న లాజిస్టిక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని లాజిస్టిక్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.వేణుగోపాల్, సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన అశోక్ మోటార్ డ్రైవింగ్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీస్ సెంటర్‌ను సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. పార్సిళ్లను మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు తక్కువ చార్జీలతో సురక్షితంగా.. త్వరగా చేరవేసే సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సెంటర్ ప్రొప్రైటర్ కనకం అశోక్, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, సింగపురం దయాకర్, లాజిస్టిక్ రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవార్డుకు ఎంపిక



స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి చెందిన పురోహితులు, జ్యోతిష్య వాస్తు పండితులు, ఆంజనేయ స్వామి ఉపాసకులు నర్సింగోజు బ్రహ్మచార్యులు జాతీయ జ్యోతిష్య రత్న బిరుదు, నంది అవార్డుకు ఎంపికైనట్లు అంజలిగ్రూప్ ఆఫ్ మీడియా ఫౌండేషన్, అందరి టీవీ చైర్మన్ కామిశెట్టి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న కరీంనగర్‌లో జరిగే జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో అందించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బ్రహ్మచార్యులు ఘన్‌పూర్‌లో విలేరులతో మాట్లాడుతూ అంజలి మీడియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ జ్యోతిష్య రత్న బిరుదు, నంది అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

భూమి పూజ



కొడకండ్ల: మండలంలోని గిర్నితండాలో గిరిజనుల ఆరాధ్యదైవమైన సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్, మేరామ్మాయాడి ఆలయ నిర్మాణానికి సోమవారం జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ అభిమన్‌గాంధీనాయక్ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. స్థానిక గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన పూజ చేసి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. సర్పంచ్‌లు రాజ్‌కుమార్, మహేష్‌నాయక్‌లు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకన్ననాయక్, ఉపసర్పంచ్‌లు నరేష్, వినోదలు, ఆలయ కమిటీ చైర్మన్ నందు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల అడ్డగింత

చిల్పూరు: చిన్నపెండ్యాల-తరిగొప్పుల రహదారిలోని వెంకటాద్రిపేట- మల్కాపూర్ గ్రామాల మధ్య సోమవారం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ రోడ్డు మరమ్మతు పనులు చేపడుతుండగా వాహన చోదకులు, ప్రజలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కందుల రఘుపతి, సీపీఐ నాయకుడు బండారి రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ గూడెల్లి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలోనే కాకుండా వ్యవసాయ పొలాల్లోనినీరు రోడ్డుపై చేరి గుంతలమయంగా మారి ఎన్నో ప్రమాదాలు జరిగాయన్నారు. సైడ్‌బర్మ్‌లు ఏర్పాటు చేయకుండా రోడ్డు వేస్తే పనులను అడ్డుకుంటామని తెలిపారు. లవన్‌కుమార్, గాదె జయపాల్‌రెడ్డి, సుధాకర్, సురేష్, సమ్మయ్య, గోపు సంపత్‌రెడ్డి, ఇనుగాల శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన రుద్రపు సతీష్(31) అనే వ్యక్తి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. సముద్రాలకు చెందిన రుద్రపు నర్సింహరాములుకు ఇద్దరు కుమారులు. కాగా, పెద్ద కుమారుడు రవి ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్న కుమారుడు సతీష్ ఈనెల 10న తండ్రితో ఇంటివద్ద గొడవపడ్డాడు. అనంతరం విషగుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

లారీలో చెలరేగిన మంటలు

రఘునాథపల్లి: హనుమకొండ నుంచి హైవేపై హైదరాబాద్ వెళ్తున్న ఓ లారీలో ఆకస్మాత్‌గా మంటలు చెలరేగాయి. స్థానికులు అప్రమత్తం చేసి ప్రమాదాన్ని నివారించిన సంఘటన మండలంలోని నిడిగొండలో సోమవారం చోటు చేసుకుంది. హైదరాబాద్ బోరోపేటకు చెందిన ఇబ్రహీం తన లారీలో కూల్‌డ్రింక్ బాటిల్స్ లోడ్‌తో వరంగల్ వెళ్లి అన్‌లోడ్ చేసి తిరిగి వస్తున్నాడు. నిడిగొండ వద్ద లారీ వెనుకాల మంటలు వ్యాపించగా స్థానికులు గుర్తించి ఆపారు. వెంటనే పక్కనే ఉన్న సిమెంట్ బ్రిక్స్ తయారు కేంద్రంలోని మోటార్ ఆన్‌చేసి పైపులతో మంటలను ఆర్పారు.

క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

జనగామ రూరల్: గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ మేకల కళింగ రాజు, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పెంబర్తిలో సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించి మాట్లాడారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కొడకండ్ల: పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో విద్యార్థులకు అందించాలని ఎంపీపీ జ్యోతి సూచించారు. సోమవారం చెరువుముందు తండ ప్రాథమిక పాఠశాల, మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లను ఆమె తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించింది. కాంప్లెక్స్ హెచ్‌ఎం రజీయాబేగం పాల్గొన్నారు.

దైవచింతన కలిగి ఉండాలి

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని.. అప్పుడే అందరూ సన్మార్గంలో పయనిస్తారని అచలయోగా ఫౌండేషన్ చైర్మన్ మహాయోగి శ్రీ బ్రహ్మనంద శ్రీధరస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఫౌండేషన్ మందిరంలో సోమవారం ఆయన మాట్లాడారు.

కేసీఆర్ సంక్షేమ పాలన, అయుష్షు కోసమే సైకిల్‌యాత్ర

దేవరుప్పుల : సీఎం కేసీఆర్ సంక్షేమ పాలనను కొనసాగేందుకు ఆయనకు ఆయుష్షు పెరుగాలని ఆకాంక్షిస్తూ సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు తెలంగాణ ఉద్యమకారుడు పిడిశెట్టి రాజు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రానికి చేరిన ఆయన సైకిల్ యాత్రకు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు సంఘీభావం తెలిపారు.

అర్హులకు ఇళ్లు అందేలా చర్యలు

దేవరుప్పుల: ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ ఏడ్ల రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కొత్తకాలనీలో పలు కాలనీలో నిర్మితమైన 43 ఇళ్లను కేటాయించేందుకు సర్పంచ్ ఈదునూరి రమాదేవి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు.

ఫిర్యాదు

కొడకండ్ల: మండలంలోని చెరువు ముందు ప్రాథమిక పాఠశాల ప్రహరీ, కిచెన్‌షెడ్డును సర్పంచ్ భర్త యాకు అక్రమంగా కూల్చివేశాడని ఎస్‌ఎంసీ చైర్మన్ ధరావత్ శ్రీను తెలిపారు. ఈ విషయంపై డీఈఓ, మండల నోడల్ ఆఫీసర్‌లకు ఫిర్యాదు చేసి తగిన చర్య తీసుకోవాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

బీమా చెక్కు అందజేత

జనగామ రూరల్: ప్రమాదవశాత్తు మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి బీమా చెక్కును ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శశికుమార్ సోమవారం అందజేశారు. పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న వెంకటేష్ పీఎంఎస్‌బీఐ, పీఎంజేజేబీవై పథకంలో రెండు లక్షల ప్రమాద బీమా సంవత్సరానికి రూ.20తో చేసుకున్నాడు. కాగా, ప్రమాదవశాత్తు అతను మృతి చెందడంతో బ్రాంచ్ మేనేజర్ కుటుంబ సభ్యులు అందజేశారు.

బండా ప్రకాశ్‌ను కలిసిన నాయకులు

బచ్చన్నపేట: తెలంగాణ శాసన మండలి నూతన డిప్యూటీ చైర్మన్‌గా నియమితులైన బండా ప్రకాశ్ ను మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు సోమవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. సతీష్‌రెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర్లు రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మహా శివరాత్రికి ఏర్పాట్లు

జనగామ రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనాథ స్వామి శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ గౌరవ అధ్యక్షుడు గజ్జెల నర్సిరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో రుద్రాభిషేకం, అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మోహనకృష్ణ, కందాడి మల్లారెడ్డి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పాలకుర్తి: డ్రాగన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాలకుర్తి కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిరి పతకాలు సాధించారని పాఠశాల ప్రత్యేకాధికారి నవీన్ తెలిపారు. ఈ మేరకు వారిని సోమవారం అభినందించారు.